ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ) , MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G) , రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్ : 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ శనివారం 14-02-2026 సంపుటి : 1 సంచిక :238 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## నష్టాల్లో స్టాక్ మార్కెట్లు



- 1,048 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 336 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
- అన్ని రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి, మెటల్ షేర్లు అత్యధికంగా పతనం

## పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా



### మార్చి 9న మళ్లీ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి దశ శుక్రవారంతో ముగిసింది. మూడు వారాల విరామం తర్వాత మళ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 9న ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం బడ్జెట్‌పై రాజ్యసభ, లోక్‌సభలో వాడీవేడీగా చర్చలు జరిగాయి.

# సేవాతీర్థ్ ఆరంభం

- ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోడీ
- నాటి నుంచి వలసవాద చిహ్నాల తొలగింపునకు చర్యలు
- స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా కొత్త భవనంలోకి పీఎంఓ
- సముదాయంలో క్యాబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి కార్యాలయాలు
- మహిళలు, యువత కోసం పలు కీలక నిర్ణయాల ఫైళ్లపై ప్రధాని సంతకాలు



దేశ పరిపాలన కార్యక్రమాలకు కేంద్రంగా మారనున్న సేవాతీర్థ్ భవన సముదాయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. దీంతో పాటు పలు కీలక మంత్రిత్వ శాఖలకు సంబంధించిన కర్తవ్య భవన్ 1, 2 లను ప్రధాని మోడీ అధికారికంగా ప్రారంభించారు. ఈ సముదాయంలో పీఎంవో కార్యాలయం సహా క్యాబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి కార్యాలయం పనిచేయనున్నాయి.

## బంగ్లాదేశ్ ఎన్నికల్లో హిందూ నేత గెలుపు

- ఢాకాలో చంద్రరాయ్ విజయఢంకా
- జమాతే-ఇ-ఇస్లామి అభ్యర్థి ఎండీ షాహినూర్ ఇస్లాంపై విజయం



## గత పాలకుల విధ్వంసం నుంచి కోలుకుంటున్నాం

- రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులతో ఐదేళ్లలో 23 లక్షల ఉద్యోగాలు
- భాగస్వామ్య సదస్సులో రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులు 610 ఎంఓయూలు
- 1000 మళ్లీ కోట్లతో పోలవరం డయాఫ్రాం వాల్ నిర్మాణం
- 2047 స్వర్ణాంధ్ర విజన్ ద్వారా అగ్రస్థానంలో ఏపీ
- ఈ నెల 16 తేదీన బిల్ గేట్స్ రాష్ట్రానికి వస్తున్నారు
- అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ కూడా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు
- రామాయపట్నం వద్ద బీపీసీఎల్ కూడా రూ.70 వేల కోట్లతో రిఫైనరీని ఏర్పాటు
- రూ.4 వేల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల అనుసంధానం
- రాజకీయాల ముసుగులో నేతలే నేరాలు చేస్తే కఠిన చర్యలు
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

గత పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం పై చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పనిచేశానాన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25.6 శాతం ఏపీకే వచ్చాయంటే ఏపీ బ్రాండ్ విలువ ఏమిటో అందరూ అర్థం చేసుకోవాలన్నారు. గత పాలకుల వేధింపుల కారణంగా అమర్ రాజా బ్యాటరీస్ పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోయిందన్నారు.



## ఆ నాలుగు మున్సిపాలిటీల్లో ఖాతా తెరవని బీఆర్ఎస్

తెలంగాణలో వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో భారత రాష్ట్ర సమితి 13 పురపాలికలతో సరిపెట్టుకుంది. కోస్గి, మక్తల్, ధర్మపురి, భైంసా మున్సిపాలిటీల్లో ఆ పార్టీ ఖాతా తెరవలేదు. ధర్మపురిలో మొత్తం 15 వార్డులు ఉండగా.. అన్నింటినీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కోస్గిలో 16 స్థానాలు ఉండగా మొత్తం కాంగ్రెస్ ఖాతాలోనే పడ్డాయి.

13 మున్సిపాలిటీల్లో సింగిల్ డిజిట్

ఎల్లారెడ్డి, యాదగిరిగుట్ట, వడ్డేపల్లి, సుల్తానాబాద్, పెద్దపల్లి, నందికొండ, మంథని, మధిర, కొడంగల్, హాలియా, చొప్పదండి, భూత్పూర్, ఆత్మకూరు మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డులో మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. 116 మున్సిపాలిటీల్లోని 2,582 వార్డుల్లో శుక్రవారం ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో కాంగ్రెస్ 1347 వార్డుల్లో విజయం సాధించి 66 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంది. భారత రాష్ట్ర సమితి 717 వార్డుల్లో గెలుపొంది 13 మున్సిపాలిటీలు దక్కించుకుంది. భాజపా 261 వార్డుల్లో, స్వతంత్రులు 256 వార్డుల్లో విజయం సాధించారు. 36 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ ఆల్ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ కైవసం చేసుకోవడం గమనార్హం

## కేంద్ర ప్రాయోజిత పథకాల్లో అదనపు నిధులు తేవాలి

- కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులపై సీఎం సమీక్ష
- ప్రతిపాదిత ప్రాజెక్టులను ఏర్పాటు చేసే అంశంపై దిశానిర్దేశం
- ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

2026-27 కేంద్ర బడ్జెట్‌లో ఏపీలో కేటాయించిన రేర్ ఎర్త్ కారిడార్ సహా వివిధ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు.



## సమగ్ర బహుముఖ వ్యూహంతో సైబర్ మోసాలకు చెక్



ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాల అంశంపై కీలక చర్చ జరిగింది. ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ హోం మంత్రి అనిత రాష్ట్ర ప్రభుత్వం సైబర్ నేరాల అరికట్టడానికి సమగ్ర బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపట్టామని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు 1930 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి, ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలుగా డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

# నేడే రాష్ట్ర బడ్జెట్

- సంక్షేమానికి పెద్ద పీట !
- ఆర్థిక సవాళ్ల మధ్య నేడు శాసన సభకు 2026-27 రాష్ట్ర బడ్జెట్
- గత ఏడాది కంటే 5 నుంచి 10 శాతం మధ్య పెరగనున్న బడ్జెట్
- రూ. 3.38 లక్షల కోట్ల నుంచి రూ. 3.48 లక్షల కోట్ల మధ్యే ఉండనున్న బడ్జెట్
- సంక్షేమం, అభివృద్ధి పనులకు పెద్ద పీట వేసే అవకాశం జనవరి నెలాఖరు వరకు రూ. 1,40,540 కోట్లు రాష్ట్ర రెవెన్యూ రాబడి 10 శాతానికి మించి రాని రాబడులు

రాష్ట్రం పునరుద్ధరణ నుంచి ప్రగతి వైపు అడుగులు వేస్తున్న ఆర్థికంగా ఇంకా సుస్థిరం కావాల్సి ఉంది. పాత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక సంక్షోభాల నుంచి బయటపడి ఊపిరి పీల్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలోనే ప్రభుత్వం మూడో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది.




## పిఎంఎంఎస్‌వై, సాగరమాల ద్వారా హార్బర్ల ఆధునీకరణ

- ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి
- ముత్యాలమ్మపాలెం మినీ జెట్టీపై ప్రీ-ఫీజిబిలిటీ అధ్యయనం
- శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

పిఎంఎంఎస్ వై, (ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన), సాగరమాల వంటి కేంద్ర పథకాల సహకారంతో రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్లను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరిస్తున్నామని వ్యవసాయ,మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పరవాడ మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో మినీ జెట్టీ, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.





## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- 40 శాతం పాఠశాలలు 2 స్టార్ కంటే తక్కువగా ఉన్నాయి
- నాడు-నేడుపై చిత్తశుద్ధి ఉంటే పెండింగ్ బిల్లులు ఎందుకు చెల్లించలేదు
- ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం
- శాసనమండలిలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 2020 నుంచి 2026 వరకు ఆర్థిక సంవత్సరాల వారీగా మనబడి నాడు- నేడు, మనబడి -మన భవిష్యత్ పథకాల కింద ఖర్చు చేసిన నిధుల వివరాలు, ఆయా పథకాల కింద పూర్తిగా అభివృద్ధి చేసిన, ఇంకా అభివృద్ధి చేయాల్సిన పాఠశాలల వివరాలపై సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, టి.కల్పలత, ఎంవీ రామచంద్రారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ... కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం రూ.7,500 కోట్లు ఖర్చుపెట్టాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించారు. ప్రతి పాఠశాలకు స్టార్ రేటింగ్ ఇవ్వాలని నేను చెప్పాను.

# జిల్లా కమర్షియల్ టాక్స్ కో-ఆర్డినేషన్ శాఖలపై సమీక్ష

**- వివిధ శాఖలు టాక్స్ లు ద్వారా రావలసిన బకాయిలను ఖజానాకు జమచేయించి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి.**

**- ఆదాయ వనరులను పెంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలను సాధించాలి.**

**- జిల్లా కమర్షియల్ టాక్స్ కో-ఆర్డినేషన్ (రెవిన్యూ వచ్చే శాఖలు) సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి దిశానిర్దేశం .**





**గాయత్రి వార్తలు,ఏలూరు జిల్లా ఇంచార్జ్(బి.ప్రభాకర్)**

జిల్లా కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కమర్షియల్ టాక్స్ కో-ఆర్డినేషన్ ( రెవిన్యూ వచ్చే శాఖలు) జిల్లా కలెక్టరు అధ్యక్షతన కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రెవిన్యూ వచ్చే శాఖలు వారీగా సమీక్షించి, నిర్ణీత గడువులోగా రావలసిన బకాయిలను ప్రభుత్వ ఖజానాకు జమ చేయించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ కమర్షియల్ టాక్స్, జిల్లా సివిల్ సప్లై, మైన్స్, పోలీసు శాఖలతో జాయింటు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి, రెవిన్యూ వసూళ్లలో ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ పురోగతిని సాధించాలన్నారు.ప్రతి నెల రెండవ వారంలో జిల్లా కలెక్టరేట్ లో ఒక సమావేశాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, రెవిన్యూ వసూళ్ల ప్రగతిని, వచ్చే నెలలో రెవిన్యూ వసూళ్లపై ఈ సందేశంలో శాఖలు వారీగా చర్చిస్తామని తెలిపారు.అలాగే మండల స్థాయిలో కూడా సమావేశం నిర్వహించాలని అన్నారు. జిల్లాలో జీఎస్టీ ఏరియర్స్ 249 కేసులు ద్వారా రూ 24 కోట్లు రావాల్సిఉందని శాఖలు వారీగా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రెవిన్యూ రికవరికీ కావలసిన సహకారం పూర్తిస్థాయిలో సమకూర్చుకుని, మంచి ప్రగతిని సాధించాలన్నారు. సరుకులు ఎగుమతులు, రవాణా అవుతున్న వాహనాలకు వే బిల్లులు, బిల్లులు చెక్ చెయ్యాలని, సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాట్లు చేసి సమర్థవంతంగా తనిఖీలు చెయ్యాలని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ భారీ, చిన్నతరహా పనులకు కాంట్రాక్టరుకు చెల్లించిన సొమ్ములు జమ అయినది వెరిఫై చేసి, వీటిద్వారా రావలసిన టాక్స్ జమ అయిందా అని పరిశీలన చెయ్యాలని అన్నారు. ఏపీ డబ్ల్యు ఐడిసి, ఆర్ ఆండ్ బి, పంచాయతీరాజ్,గృహనిర్మాణ శాఖలతో ఒక కమిటీ ఏర్పడి ఎప్పటికప్పుడు వెరిఫై చేసి పూర్తిస్థాయిలో నివేదికలు ఇవ్వాలని ఆదేశించామన్నారు. కమర్షియల్ టాక్స్ విభాగానికి, రెవిన్యూ వచ్చే శాఖలకు సంబంధించిన పన్ను వసూళ్ల పురోగతి, బకాయిలు వసూళ్లు, జీఎస్టీ అమలు, ఈ-వే బిల్ తనిఖీలు, అక్రమ రవాణా నియంత్రణ చర్యలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించామని తెలిపారు. ఆదాయ వనరులను పెంచేందుకు అధికారులు సమన్వయంతో పని, లక్ష్యాలను అధిగమించాలని సూచించామని తెలిపారు. పన్ను ఎగవేతలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించడంతో పాటు, వ్యాపార వర్గాలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించామని తెలిపారు. ప్రభుత్వ ఆదాయం పెంపు లక్ష్యంగా అన్ని శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని పేర్కొన్నారు. వివిధ శాఖలు పరిధిలో పెండింగులో ఉన్న పన్నులు, ఫీజులు, లీజులు మరియు ఇతర బకాయిలు వివరాలను సమగ్రంగా పరిశీలించి, వసూళ్ల ప్రక్రియను వేగవంతం చెయ్యాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. జిల్లా స్థాయిలో ఆదాయం పెంచేందుకు అనుసరించ వలసిన మార్గాలుపై సమీక్షించడం జరిగిందని అన్నారు. ఖనిజాలు, ఇసుక, భూములు లీజులు, వాణిజ్య పన్నులు, స్టాంపు డ్యూటీలు వంటి వనరులు ద్వారా ఆదాయం పెంపు సాధ్యమని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు వినియోగాన్ని మెరుగు పరచడం, లీజులు పారదర్శకంగా నిర్వహించడం, డిజిటల్ పద్ధతుల్లో వసూళ్లు చేయడం ద్వారా ఆదాయం పెంపు సాధ్యం అవుతుందని పేర్కొన్నారు.ప్రతి శాఖ అధికారి తమ శాఖకు సంబంధించిన వసూళ్ల లక్ష్యాలను నిర్దిష్ట కాల వ్యవధిలో పూర్తి చెయ్యాలని స్పష్టంచేసినట్లు తెలిపారు. నెలవారీ సమీక్ష సమావేశాలు నిర్వహించి పురోగతిని పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ నక్కా సూర్య చంద్రరావు, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, కమర్షియల్ టాక్స్ జాయింటు కమీషనరు బి.నాగార్జున రావు, ఆర్అండబి శాఖ యస్ఇ కె.విజయరత్నం, జడ్పీ సిఇవో యం.శ్రీహరి, జిల్లా ఆర్ డబ్ల్యు యస్ అధికారి జి.త్రినాథ బాబు, సివిల్ సప్లై జిల్లా మేనేజరు పి.శివరామ మూర్తి, జిల్లా డియస్ వో ఇ.బి. విలియమ్స్, మైన్స్ డిడి జి.పాపారావు, జిల్లా పరిశ్రమలు కేంద్రం జియం ఆర్.వెంకటరావు, లీగల్ మెట్రాలజీ సహాయ కంట్రోలర్ కె.యస్.రాజు, కమర్షియల్ టాక్స్ అధికారులు, సంబంధిత శాఖలు అధికారులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఆవాస యోజన మంజూరుకు డబ్బులు డిమాండ్ చేస్తే క్రిమినల్ చర్యలు

**- 7093930105 నెంబర్ కు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం,**

**- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం**

**- గృహనిర్మాణ శాఖాధికారి జి. సత్యనారాయణ**



**గాయత్రి వార్తలు,ఏలూరు జిల్లా ఇంచార్జ్,బి.ప్రభాకర్**

జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిరుపేదల ఇళ్ల మంజూరుకు డబ్బులు డిమాండ్ చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి జి. సత్యనారాయణ హెచ్చరించారు. ఏలూరు జిల్లా పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) మరియు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకాల కింద గృహ నిర్మాణా మంజూరుకు సంబంధించిన సర్వే నిర్వహించబడిందని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) కింద 54,234 మంది లబ్ధిదారులు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద 2,750 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణానికి నమోదు చేసుకున్నారన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద నమోదు చేసుకున్న 2,750 మంది లబ్ధిదారులలో ఇప్పటివరకు 1,191 మందికి గృహాలు మంజూరు చేయడం జరిగిందని, ఇంకా మిగిలిన అర్హులైన లబ్ధిదారులు, అర్బన్ పరిధిలో స్వంత స్థలం కలిగి గృహ మంజూరుకు అర్హత ఉన్నవారు, హౌసింగ్ కార్యాలయంలో నమోదు చేసుకోవలసిందిగా ఆయన కోరారు. గృహ మంజూరు కొరకు దరఖాస్తు చేసుకొన్న లబ్ధిదారులను పారదర్శకంగా మరియు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకము నిబంధనలు అనుగుణంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయుట జరుగుతుందన్నారు. నమోదు చేసుకున్న లబ్ధిదారులు గృహాల మంజూరు కోసం ఎవరికీ ఎటువంటి డబ్బులు చెల్లించనవసరం లేదన్నారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే 7093930105 నెంబర్ కు ఫిర్యాదు చేస్తే వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని సత్యనారాయణ తెలియజేసారు.

# చట్టబద్ధమైన పిల్లల దత్తత ద్వారా అమ్మతనం మంచి అనుభూతి







**గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్**

చట్టబద్ధమైన దత్తత ద్వారా పిల్లలని దత్తత తీసుకోవడం అమ్మతనాన్ని ఆస్వాదించటం చాలా మంచి అనుభూతిని ఇస్తుందని రెండు నెలల క్రితం ఫ్రీ అడాప్షన్ ఫోస్టర్ కేర్ లో కుటుంబముల లోకి వెళ్ళిన ఇద్దరు బాలికల దత్తత తల్లిదండ్రులు ఈరోజు కలెక్టర్ కె.వెట్రీసెల్వీ ముందు హాజరై వారి మనోభావాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రీ సెల్వీ మాట్లాడుతూ ఈ రెండు నెలలు కాలంలో పిల్లలు వారితో ఎలా ఉన్నది, పిల్లలు లేకముందు వారి కుటుంబ వాతావరణం ఎలా ఉన్నది, అడిగి పిల్లల ప్రాధాన్యతల కొరకు ఎలాంటి మార్పులు చేసుకున్నది, వారి ఆలనా పాలనా చూసుకోవటానికి ఇంట్లో ఎవరెవరు ఉన్నారో, వారు ఈ దత్తత వెళ్లిన బాలల తో ఏ విధంగా ఉంటున్నది, వారి ఆహారపు అలవాట్లు గురించి చదివించడానికి చేస్తున్న ఏర్పాట్లు గురించి వివరంగా అడిగి తెలుసుకుని అన్నీ బాగా ఏర్పాటు చేసినారని నిర్ధారించారు. తర్వాత తమిళనాడు రాష్ట్రానికి చెందిన దివ్యానంగం,పద్మావతి దంపతులకు తేజశ్రీ అను పాప నీ, బేబీ మోక్షజ్ఞ మీనాక్షి అను పది నెలల వయస్సు గల పాపని,సెంథిల్, భానుప్రియ అను దంపతులు కి ఫైనల్ దత్తత ధృవీకరణ ఆర్డర్ కాపీ లను అందించారు. అదేవిధంగా వీరి ఫాలో అప్ వివరాలను నిర్దిష్ట ఫార్మాట్ లో ఎప్పటికప్పుడు సంబంధిత ఏజెన్సీ ల నుండి కలెక్ట్ చేసి మిషన్ వాత్సల్య పోర్టల్ లో అప్లోడ్ చేయవలసిందిగా జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్య చక్రవేణి నీ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ లోని మిషన్ వాత్సల్య పథకం అమలు చేసే జిల్లా బాలల సంరక్షణ అధికారి సిహెచ్ సూర్యచక్ర వేణి, శిశు గృహ మేనేజర్ శ్రీమతి పి.భార్గవి పాల్గొన్నారు.

# ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎండీ,పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్ మెంట్ కమిషనర్ గా బాలసుబ్రహ్మణ్యం



**గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్(బి.ప్రభాకర్)**

ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఉఎండీ,పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్ మెంట్ కమిషనర్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్.బాలసుబ్రమణ్యంను ఏపీ ప్రభుత్వం నియమించింది.సీఎస్ విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

# ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా గిరిప్రదక్షిణ మార్గ పనుల ప్రారంభం





**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13,గాయత్రి వార్తలు:రిపోర్టర్ : రంజిత్**

శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గ అభివృద్ధి పనులకు నేడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన జరిగింది. అమరావతి నుంచి ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, తిరుపతి జిల్లా ఇంచార్జ్ మంత్రి మరియు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఆలయ ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ , ఈవో బాపిరెడ్డి, బిజెపి ఉపాధ్యక్షులు కోల ఆనంద్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు హాజరయ్యారు.రూ. 9.80 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా గిరిప్రదక్షిణ మార్గాన్ని అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేసి, భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించనున్నారు. దశాబ్దాలుగా భక్తులు ఎదురుచూస్తున్న ఈ అభివృద్ధి కార్యక్రమం త్వరలోనే రూపుదిద్దుకోనుంది.ప్రాజెక్టు పూర్తయిన అనంతరం గిరిప్రదక్షిణ మార్గం సుందరంగా, సురక్షితంగా మారి యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో జనసేన సేవా కార్యక్రమం

**- లక్ష మంచినీటి బాటిళ్ల పంపిణీ**



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13, గాయత్రి వార్తలు:రిపోర్టర్ : రంజిత్**

శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సేవలో భాగంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారీ సేవా కార్యక్రమం నిర్వహించారు.జనసేన పార్టీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ అజయ్ నేతృత్వంలో లక్ష మంచినీటి బాటిళ్లను ఆలయ ఆవరణలో ఆలయ ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ కి అందజేశారు. ఉత్సవాల సమయంలో భారీగా తరలివచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జయప్రకాష్, మాధవ మహేష్ తదితరులు పాల్గొన్నారు. భక్తుల సేవే లక్ష్యంగా జనసేన పార్టీ నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోందని నాయకులు పేర్కొన్నారు.

# విద్యార్థినిలకు రక్తహీనతపై అవగాహన అవసరం

**- డాక్టర్ చెన్న కృష్ణ**




**గాయత్రి వార్తలు:** మండల కేంద్రంలోని సి ఎస్ పురం కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ప్రపంచ రక్తహీనత దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ చెన్న కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఆడపిల్లలు రక్తహీనత (అనీమియా) గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రక్తహీనత లక్షణాలు, కారణాలు, దాని వల్ల కలిగే సమస్యలు గురించి వివరించారు. ఐరన్, కాల్షియం, జింక్ సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలను ప్రతిరోజూ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాలింతలు, గర్భిణీ స్త్రీలు రక్తహీనతకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థినిలు ఆరోగ్యానికి సంబంధించిన సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి జె. వెంకట్రావు మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థినీలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని సూచించారు. మూఢనమ్మకాలను విడిచిపెట్టి పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు మాలకొండా రెడ్డి, శంకర్ , ప్రిన్సిపాల్ షేక్ రేష్మ, సిఆర్టి లు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# బలివే మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష..

**- మంత్రి పార్థసారథి, జిల్లా కలెక్టర్ హాజరు**




**గాయత్రి వార్తలు,ఏలూరు జిల్లా ఇంచార్జ్(బి.ప్రభాకర్)** ముసునూరు మండలం, బలివే గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. భక్తులకు సౌకర్యాలు, శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్యం వంటి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. ఆలయ పునర్నిర్మాణానికి రూ. 2.50 కోట్లు మంజూరు చేసినట్లు, అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తామని తెలిపారు. ఉత్సవాల అనంతరం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కూడా భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రత, సీసీ కెమెరాలు, డ్రోన్లు, ఆర్టీసీ బస్సులు తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## పిఎల్ఐ బీమా కుటుంబానికి అండ

## శ్రీకాళహస్తిలో రూ.23 లక్షల చెక్కు అందజేత




**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13, గాయత్రి వార్తలు: రిపోర్టర్ : రంజిత్** తపాలా శాఖ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పిఎల్ఐ) పథకం ఓ పేద కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలిచింది. శ్రీకాళహస్తి పట్టణం బంగారమ్మ గుడి కాలనీకి చెందిన వి. వెంకటాద్రి తపాలా శాఖలో రూ. 20 లక్షల పాలసీ తీసుకున్నారు. రెండు సంవత్సరాల పాటు ఆయన మొత్తం రూ. 2,56,080 ప్రీమియం చెల్లించారు. అయితే అనుకోని పరిస్థితుల్లో ఆయన మరణించడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడింది. ఈ నేపథ్యంలో పిఎల్ఐ ద్వారా రూ. 23,02,001 బీమా మొత్తాన్ని మృతుడి భార్య అలేఖ్యకు అందజేశారు. శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ తపాలా శాఖ ఐపీఓ బాలాజీ, హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్టుమాస్టర్ రాంబాబు తపాలా శాఖ కార్యాలయంలో చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఇండియన్ పోస్ట్ అమలు చేస్తున్న పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పిఎల్ఐ), ఆర్‌పిఎల్ఐ పథకాలు కుటుంబ భద్రతకు బలమైన ఆధారమని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు సమీప బ్రాంచ్ పోస్టాఫీసులను సంప్రదించి ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మృతుడి భార్య అలేఖ్య మాట్లాడుతూ, తన భర్త తీసుకున్న బీమా పాలసీ వల్లే కుటుంబానికి ఈ క్లిష్ట సమయంలో ఆర్థికంగా అండ లభించిందని కృతజ్ఞతలు తెలిపారు.

# స్వచ్ఛ సర్వేక్షణ సర్వే

**- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ విడుదల చేసిన మార్గదర్శకాలు మరియు సూచనలు...**



**గాయత్రి వార్తలు:** గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ సర్వేకు సంబంధించిన ఒకరోజు సామర్థ్య వికాస మరియు శిక్షణ కార్యక్రమం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ విడుదల చేసిన మార్గదర్శకాలు మరియు సూచనల మేరకు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నాలెడ్జ్ పార్ట్నర్‌గా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ వ్యవహరించి శిక్షణ అందించింది. ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా జయ మాధురిమ యెండ్లూరి పాల్గొని, స్వచ్ఛ సర్వేక్షణ లక్ష్యాలు, అమలు విధానం, ఫీల్డ్ స్థాయి డేటా సేకరణ, పౌర భాగస్వామ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, శుభ్రత ప్రమాణాలు మరియు సర్వేలో అనుసరించాల్సిన విధానాలపై సమగ్రంగా వివరణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా ప్రాక్టికల్ అంశాలు, ఫీల్డ్ అమలు చర్యలు మరియు నివేదికల సమర్పణ విధానం గురించి వివరించారు. గిద్దలూరు కమీషనర్ రమణ బాబు మరియు చైర్మన్ వెంకట సుబ్బయ్య గారు మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ సర్వేను విజయవంతం చేయడానికి ప్రతి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, పట్టణాన్ని శుభ్రంగా మరియు ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉండాలని వారు సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ సర్వే లో ఈ సంవత్సరం మన గిద్దలూరు నగరం మంచి ర్యాంక్ సాధించటానికి ప్రతి ఒక్కరూ కూడా పనిచేద్దాము అని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సిబ్బందిలో అవగాహన పెరిగి, స్వచ్ఛ సర్వేక్షణలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. పట్టణ పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యం, వ్యర్థాల వేరు చేయడం మరియు ఆరోగ్య పరిరక్షణ అంశాలలో సిబ్బంది చురుకుగా పనిచేయాలని సూచించారు. శిక్షణలో పొందిన మార్గదర్శకాలను ఫీల్డ్ స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి గిద్దలూరు శానిటరీ ఇన్స్పెక్టర్ స్వర్ణ , వార్డు సిబ్బంది , మెప్మా ఆర్పిలు మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది హాజరై శిక్షణ పొందారు.

# పాకల బీచ్ ఫెస్టివల్‌కు సర్వం సిద్ధం: జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు





**- ఫిబ్రవరి 14, 15 తేదీల్లో వేడుకలు**
**- హెలికాప్టర్ రైడింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణ**

**గాయత్రి వార్తలు:** సింగరాయకొండ మండలం పాకల తీరంలో నిర్వహించ తలపెట్టిన బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు అవసరమైన అన్ని రకాల పనులు పూర్తి కావచ్చాయని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు వెల్లడించారు. గురువారం ఆయన పాకల బీచ్‌ను సందర్శించి, ఫెస్టివల్ కోసం జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేస్తూ, పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా బీచ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకలకు విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పండుగ వాతావరణంలో జరిగే ఈ వేడుకల్లో ప్రజల వినోదం కోసం భారీ ఏర్పాట్లు చేశామన్నారు.

### సమయ వేళలు మరియు విశేషాలు:

ఫెస్టివల్ మొదటి రోజైన 14వ తేదీన ఉదయం 9 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని కలెక్టర్ వివరించారు. ఇక 15వ తేదీన మహాశివరాత్రి పర్వదినం కావడంతో, భక్తులు మరియు సందర్శకుల సౌకర్యార్థం ఉదయం 9 గంటల నుండి అర్ధరాత్రి 1:00 గంట వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా హెలికాప్టర్ రైడింగ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు నోరూరించే వంటకాలతో ఫుడ్ కోర్టులు, వైవిధ్యభరితమైన ఎగ్జిబిషన్లు మరియు కళ్లు చెదిరే సాంస్కృతిక ప్రదర్శనలు పర్యాటకులను అలరించనున్నాయని చెప్పారు. జిల్లా యంత్రాంగం పర్యాటకుల భద్రత మరియు సౌకర్యాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సువర్ణ, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న మరియు ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# నారాయణస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

**- భక్తుల రద్దీ నియంత్రణకు క్రమబద్దీకరణకు మార్గదర్శకాలు**

**గాయత్రి వార్తలు:** మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామివారి దర్శనార్థం భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, ఎటువంటి అసౌకర్యం కలగకుండా భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు కనిగిరి శాసనసభ్యులు, జిల్లా టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు భక్తుల రద్దీ క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలు క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకున్నట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామివారి దర్శనానికి భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు నూతన నిబంధనల ప్రకారం స్థానిక గ్రామస్తులు మరియు విఐపీలు ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు మాత్రమే ప్రత్యేక దర్శనం పొందగలరని తెలిపారు. ఉదయం 9 గంటల తర్వాత వచ్చే స్థానికులు, విఐపీలు కూడా సాధారణ భక్తులతో కలిసి క్యూలైన్ ద్వారానే దర్శనం చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు గంటల తరబడి క్యూలైన్లో నిలబడాల్సిన పరిస్థితి లేకుండా ఉండేందుకు ఈ మార్పులు అమలు చేస్తున్నామని అన్నారు భక్తులందరికీ త్రాగునీరు వైద్య సదుపాయాలు భద్రతా ఏర్పాటు కల్పించేందుకు యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని అన్నారు మహాశివరాత్రి వేడుకలు ప్రశాంతంగా విజయవంతంగా సాగేందుకు భక్తులందరూ క్రమశిక్షణ పాటిస్తూ



దేవస్థాన సిబ్బంది మరియు అధికారుల సూచనలను అనుసరించాలని కోరారు భక్తులు సహకరించి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు

## ఆలయ ఆవరణలో సేవా కార్యక్రమం భక్తుల కోసం ఔషధాలు, నీటి సదుపాయం



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13, గాయత్రి వార్తలు:రిపోర్టర్ : రంజిత్** శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు సేవలందించే ఉద్దేశంతో శ్రీకాళహస్తి కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ మరియు ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మెడిసిన్లు, వాటర్ బాటిళు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బృందమ్మ మరియు సతీమణి బొజ్జల రీషితా రెడ్డి చేతుల మీదుగా ఆలయ ఆవరణలో దేవస్థానం డిప్యూటీ ఈఓ ఎన్.ఆర్. కృష్ణా రెడ్డి కి అందజేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో అవసరమైన వైద్య సహాయం మరియు తాగునీటి సదుపాయం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల సేవలో భాగస్వాములైన సంఘాల ప్రతినిధులను దేవస్థానం అధికారులు అభినందించారు.



# 'క' దర్శకులతో సాయితేజ్

రెండేళ్లుగా 'సంబరాల ఏటిగట్టు' సినిమాతోనే ప్రయాణం చేస్తున్నారు కథానాయకుడు సాయిదుర్గాతేజ్. భారీ స్థాయిలో రూపొందుతున్న ఆ చిత్రం తుదిదశకు చేరుకోవడంతో, ఇప్పుడు ఆయన కొత్త సినిమాని ఆరంభించడానికి సిద్ధమయ్యారు. 'క' సినిమాతో విజయాన్ని అందుకున్న దర్శకద్వయం సుజీత్, సందీప్ చెప్పిన కథకు సాయిదుర్గా తేజ్ పచ్చజెండా ఊపారు. ఈ కలయికలో సినిమా ఉగాది రోజున ప్రారంభం కానున్నట్టు సమాచారం. 'మన శంకరవరప్రసాద్‌గారు'తో విజయాన్ని అందుకున్న షైన్ స్క్రీన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుంది.

# అరుదైన సినిమా 'మృత్యుంజయ్'



"పాటలు లేకుండా, కథానాయికలు లేకుండా, హాస్యం లేకుండా నిజాయతీగా రూపొందే థ్రిల్లర్ సినిమాలు తెలుగులో అరుదు. అలాంటి ఓ అరుదైన సినిమానే మా 'మృత్యుంజయ్'. ఇందులో నా నటన కూడా కొత్తగా ఉంటుంది" అన్నారు శ్రీవిష్ణు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రెబా మోనికా జాన్ ముఖ్యభూమిక పోషించారు. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహించారు. సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం టీజర్‌ని ప్రముఖ దర్శకుడు రాజమౌళి విడుదల చేశారు.



# నిక్ నాకు ఎప్పుడూ ప్రేరణే..
## ట్రోల్స్‌కు ప్రియాంక చోప్రా స్ట్రాంగ్ రిప్లై!

బాలీవుడ్ నుండి హాలీవుడ్ వరకు తన నటన, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న నటి ప్రియాకం చోప్రా. వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ... తన వ్యక్తిగత జీవితాన్ని, వృత్తిపరమైన బాధ్యతలను బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఎస్ ఎస్ రాజమౌళి దర్శకత్వంతో సూపర్ స్టార్ మహేష్ బాబుతో కలిసి రూపుదిద్దుకుంటున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'లో ప్రియాంక చోప్రా నటిస్తుంది. తాజాగా ఈ బ్యూటీ తన వ్యక్తిగతం జీవితంపై వస్తున్న ట్రోల్స్ కు గట్టిగా కౌంటర్ ఇచ్చిపడేసింది.

నిక్ జోనాస్ తో పెళ్లి అయ్యి ఎనిమిదేళ్లు పూర్తైన సందర్భంగా తమ వివాహంపై వచ్చిన ట్రోల్స్ ను లెక్క చేయుబోనని నటి ప్రియాంక చోప్రా స్పష్టంచేసింది. 2018లో వెళ్లి జరిగినప్పటి నుంచి వయసు తేడా. వేర్వేరు దేశాలు, వేర్వేరు మతాలు అనే కారణాలతో తమ సంబంధంపై చాలామంది మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేసింది. మొదట్లో ఆ మాటలు తనకు చాలా బాధ పెట్టాయని, కానీ ఇప్పుడు వాటిని పట్టించుకోవడం మానేశానని చెప్పుకొచ్చింది. "ఇప్పటికీ మా పెళ్లి చెడిపోతుందని ఎదురు చూస్తే..? అది వాళ్ల ఇష్టం. నేను ఇక దానిపై ఆలోచించను అని స్పష్టం చేశారు.

### నిక్ తనకు ప్రతిరోజూ ప్రేరణే..

తాను, నిక్ ఇద్దరం బయట మాటలకన్నా ఒకరినొకరు నమ్ముకున్నామని ప్రియాంక తెలిపారు. నిక్ లో ఉన్న నిజాయితీ, సూటితనం తనకు చాలా ఇష్టమని చెప్పారు. చిన్న వయసులోనే కెరీర్ మొదలుపెట్టిన నిక్ స్వభావం తనకు ప్రతిరోజూ ప్రేరణనిస్తుందని అన్నారు. ఆరు నెలల్లోనే పెళ్లి నిర్ణయం తీసుకోవడం తనకే ఆశ్చర్యంగా అనిపించిందని ప్రియాంక వెల్లడించింది. రాజస్థాన్ లో 2018లో పెళ్లి చేసుకున్న ఈ జంటకు 2022లో కుమార్తె మాల్టీ మేరీ చోప్రా జోనాస్ జన్మించింది. ప్రస్తుతం ప్రియాంక వారణాసి తెలుగు సినిమాతో పాటు సిటాడెల్ సీజన్-2, ది బన్, హెడ్స్ ఆఫ్ స్టేట్ వంటి పలు ప్రాజెక్టుల్లో నటిస్తోంది.

# వెంకీ అట్లూరితో నాని మూవీకి ప్లాన్




స్టార్ కథానాయకుడు నాని ప్రస్తుతం వరుస హిట్లతో జోష్ మీద ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ది ప్యారడైజ్ సినిమాతో బిజీగా ఉన్న నాని ఆ తర్వాత సుజీత్ దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నాడు. అయితే ఈ రెండు చిత్రాలు కాకుండా మరో క్రేజీ దర్శకుడితో నాని చేతులు కలపబోతున్నట్లు తెలుస్తుంది. 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి వైవిధ్యమైన చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు వెంకీ అట్లూరితో నాని సినిమా చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మించబోతున్నాడు. 'జెర్సీ' వంటి నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమా తర్వాత నాని ? సితార కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలోనే చిత్రబృందం వెల్లడించనుంది. ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం మార్చి 26, 2026న విడుదలయ్యే అవకాశం ఉంది. దీని తర్వాత సుజీత్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నారు. మరోవైపు వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్య హీరోగా 'విశ్వనాథన్ అండ్ సన్స్'చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ కమిట్‌మెంట్లు అన్నీ పూర్తయిన తర్వాత, 2026 ద్వితీయార్థంలో నాని ? వెంకీ అట్లూరి ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.



# శక్తిమంతమైన కథలో?

'టాక్సిక్' చిత్రంలో నదియాగా ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమవుతోంది అందాల తార కియారా అద్వాణీ. ప్రస్తుతం మాతృత్వపు దశను ఆస్వాదిస్తున్న ఈమె.. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. "బరేలీ కీ బర్ఫీ', 'పంగా' లాంటి హిట్ చిత్రాలను రూపొందించిన దర్శకురాలు అశ్వినీ అయ్యర్ తివారీతో ఓ ప్రాజెక్టు కోసం చేతులు కలిపిందట కియారా. "ఇప్పుడు రాబోయే ప్రాజెక్టు ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. ఇప్పటికే దీని గురించి కియారా, దర్శకురాలి మధ్య చర్చలు పూర్తయ్యాయి. ఈ చిత్రాన్ని శక్తిమంతమైన మహిళా ప్రాధాన్య కథగా తీర్చిదిద్దనున్నారు. కియారా 'టాక్సిక్' చిత్ర షూటింగ్‌ను పూర్తి చేసిన తర్వాత ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. త్వరలో ఈ ప్రాజెక్టు గురించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ"ని కియారా సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# అప్పలసూరిగా జగపతిబాబు




ఒకప్పటి ఫ్యామిలీ హీరో, ప్రస్తుతం స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా దూసుకుపోతున్న జగపతి బాబు తాజాగా తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం ఆయన పూర్తిగా మారిపోయిన కొత్త రూపం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోను చూసిన నెటిజన్లు ఇతను జగపతి బాబా అంటున్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు 'అప్పల సూరి' అనే కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఆ పాత్ర కోసం ఆయన బాగా బరువు తగ్గి, వయసు ముదిరిన వ్యక్తిలా కనిపించేలా ప్రత్యేక మేకోవర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా విడుదలైన సెట్స్ ఫోటోలో దర్శకుడు బుచ్చిబాబుతో మాట్లాడుతున్న జగపతి బాబు రూపం చూసి అభిమానులు షాక్ అవుతున్నారు. ఏ కోణంలో చూసినా ఆయన గుర్తుపట్టలేనంతగా మారిపోయారని పలువురు అభిప్రాయపడుతున్నారు. జగపతి బాబు బర్త్ డే సందర్భంగా ఈ పిక్ రిలీజ్ చేశారు మేకర్స్. గతంలో కూడా జగ్గూ భాయ్‌కి సంబంధించిన పిక్ ఒకటి షేర్ చేయగా, అది కూడా నెట్టింట వైరల్ అయింది. ఇక జగపతి బాబు గతంలో కూడా పాత్ర కోసం తన లుక్‌ను పూర్తిగా మార్చుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి 'పెద్ది' కోసం తీసుకున్న మేకోవర్ మాత్రం మరింత విభిన్నంగా ఉండటంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఒకప్పుడు హీరోగా మెప్పించిన ఆయన, తర్వాత విలన్ మరియు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించి వరుస విజయాలతో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇక రామ్ చరణ్ - జగపతి బాబు కాంబినేషన్ ఇప్పటికే 'రంగస్థలం' చిత్రంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. మరోసారి ఈ జోడీ 'పెద్ది'లో కనిపించబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతుండగా, జగపతి బాబు పోషిస్తున్న పాత్ర ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలనే ఉత్సుకత సినీ ప్రియుల్లో నెలకొంది. మొత్తానికి, 'పెద్ది' కోసం జగపతి బాబు చేసిన ఈ భారీ మేకోవర్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.

*GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,* SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.